క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో శనివారం ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఇసుక సరఫరా, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమావేశం జరిగింది. లేఅవుట్ల వారీగా సమీక్షించిన కలెక్టర్.. అక్కడ చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జనవరి నుంచి మార్చిలోగా 10 వేల ఇళ్లను పూర్తి చేయాలన్నారు. హౌసింగ్ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు, డీఈ కె.సూర్యారావు, యూసీడీ పీడీ సత్యవేణి, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, ఎస్డీసీ సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ కోర్సులపై చర్చ

మహారాణిపేట: ఎంబీబీఎస్ తర్వాత పీజీ కోర్సులకు ప్రత్యామ్నాయ కోర్సులపై శనివారం ఆంధ్రా మెడికల్ కాలేజీలో సమావేశం జరిగింది. డీఎన్‌బీ, ఇతర అనుబంధ కోర్సులపై చర్చించారు. నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ వైస్ చైర్మన్ ఆచార్య మినూ బాజ్, డీఎంఈ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఇన్‌చార్జి ఉపకులపతి డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, డాక్టర్ బాలరాజు, డాక్టర్ తిరుమల ప్రసాద్ తదితరులు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ఆంధ్రా మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మన్మథరావు తదితరులతో చర్చించారు. పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల వల్ల ఉన్నత చదువులు చదవాలనుకునే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ఇన్‌కమ్‌ట్యాక్స్ అపిలేట్ ట్రిబ్యునల్ జస్టిస్ సీవీ బదంగ్

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారిని శనివారం ఇన్‌కమ్‌ట్యాక్స్ అపిలేట్ ట్రిబ్యునల్ జస్టిస్ సీవీ బదంగ్ దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలికి ఆయనచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనాశక్తికి దోహదం.. గణిత శాస్త్రం

దాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ గణితశాస్త్రం విద్యార్థుల్లో మంచి ఆలోచన శక్తిని, సృజనాత్మకతను పెంపొందిస్తుందని, గణిత శాస్త్రం అన్ని శాస్త్రాలతో మిళితమైందని తెలిపారు. గణితం లేనిదే పురోగతి లేదని ఆయన తెలిపారు. గణితం శాస్త్రాన్ని ఆధారం చేసుకునే ప్రపంచం ముందుకు పురోగమిస్తుందని పేర్కొన్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో గణిత శాస్త్ర ప్రయోగశాలకు కొత్త భవనం నిర్మిస్తున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ కుమారి, అకడమిక్ డీన్ డి. శంకరనారాయణరావు, గణిత, సాంఖ్యక శాస్త్ర విభాగాధిపతి పి. గాంధీ, గణిత శాస్త్ర అధ్యాపకులు సీహెచ్ మల్లిక, అనంతలక్ష్మి, డి. అనిత, వి. ప్రమీలాకుమారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జననేత.. సంక్షేమ ప్రదాత

- పండగలా మాజీ సీఎం జగన్ బర్త్‌డే వేడుకలు
- పేదలకు నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, చీరల పంపిణీ
- జగన్‌తోనే పేదల సంక్షేమం అన్న నాయకులు, ప్రజలు



37వ వార్డులో పేదలకు చీరలు, పండ్లు, బ్రెడ్స్ అందజేస్తున్న వాసుపల్లి, జాన్‌వెస్లీ, జానకీరామ్ తదితరులు



అంధులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న కొండా రాజీవ్‌గాంధీ



అచ్చియ్యమ్మపేటలో చీరలు పంపిణీ చేస్తున్న తోట పద్మావతి, వాసుపల్లి, జాన్‌వెస్లీ



బంగారుమెట్టలో చీరలు పంపిణీ చేస్తున్న కోలా గురువులు, ద్రోణంరాజు శ్రీవత్సవ్ తదితరులు



వెంకటేశ్వరమెట్టపై కేక్ కట్ చేస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు



41వ వార్డు పార్టీ కార్యాలయంలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వాసుపల్లి, పూర్ణిమ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న జాన్‌వెస్లీ, సర్వేశ్వరరెడ్డి

దాబాగార్డెన్స్: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నియోజకవర్గ పరిధిలో శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు.

స్వామి వివేకానంద సంస్థలో..

పాత నగరంలో గల స్వామి వివేకానంద సంస్థలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండా రాజీవ్‌గాంధీ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అంధులకు అల్పాహారం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

29వ వార్డులో..

29వ వార్డు పరిధి జగదాంబ జంక్షన్ సమీపాన గల మహానేత వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం వార్డు నాయకుడు పీతల వాసు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ పాల్గొని కేక్ కట్ చేశారు. పేదలు, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, పార్టీ నాయకులు బొండాడ వెంకట్రావు, మహేష్, కొంౖడు సతీష్, శివ, గొరిపాటి శివ, గొలగాని మధు, పీతల రాజు, ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండా రమణ, సనపల రవీంద్ర భరత్ పాల్గొన్నారు.

37వ వార్డులో..

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం, క్రిస్మస్ పండగ 37వ వార్డులో వార్డు నాయకుడు ఆకుల యేసు ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, వార్డు నాయకులు నొల్లు పోతుస్వామి, డేవిడ్ రాజు పాల్గొని కేక్ కట్ చేశారు. పేదలకు చీరలు, పండ్లు, బ్రెడ్స్ అందజేశారు. కార్యక్రమంలో రామరాజు, సారిక దైవకుమార్, ఆనంద్, రోజా, రమణి, డాక్టర్ రమణ, రామచంద్రరావు, శేఖర్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

33వ వార్డులో..

అల్లిపురం: వార్డు నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో బంగారుమెట్టలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు కోలా గురువులు, నియోజకవర్గ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రచార కమిటీ ఉపాధ్యక్షుడు పాల శ్రీహరిరెడ్డి, వార్డు నాయకులు, కార్యకర్తలు యల్లంకి చిన్నమ్మలు, కణితి బ్రహ్మం, పిల్లి శివ, పాల్తేటి ఊర్వశి, ఎండీ ఖాన్, పి.శివకుమార్, నీలాపు అయ్యప్పరెడ్డి, ప్రసాదరెడ్డి, పలికిల శివ, దుంప గుణ, మానస పాల్గొన్నారు.

34వ వార్డులో..

వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో అచ్చియ్యమ్మపేట, డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, లింగం శ్రీనివాస్, లండా రమణ, పీతల వాసు, తాతబ్బాయి తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

జీవీఎంసీ 35వ వార్డులో..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకుడు అలపన కనకరెడ్డి అధ్వర్యంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, రాష్ట్ర క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు జాన్‌వెస్లీ ముందుగా కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం, లక్ష్మణ్, పెదమూర్తి, సంతోష్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్, వినోద్, లండా సుధా, ప్రేమ్‌కుమార్, డాన్యూల్, రమ్య, దుర్గాప్రసాద్, 29, 30 వార్డుల నాయకులు పీతల వాసు, దశమంతుల మాణిక్యం, లండా రమణ, ముజీబ్‌ఖాన్, రవీంద్రభరత్ పాల్గొన్నారు.

వెంకటేశ్వరమెట్టపై..

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు బొడ్డేటి ప్రసాద్, కొడమంచిలి శ్రీను ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం వెంకటేశ్వర మెట్టపై జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ పాల్గొని కేక్ కట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 41వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్ నేతృత్వంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు పండ్లు, చాక్లెట్ బాక్సులు, వస్త్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చేతకాని హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం పేదలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో వేళంగిణిరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, దాలిబాని మధు, రాజా, దేవి, అన్నపూర్ణ, ఈశ్వరి, ఆనంద్, శ్రీనివాస్‌రావు, కన్వీనర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జీవీఎంసీ 27వ వార్డులో..

సీతమ్మధార: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు 27వ వార్డు దొండపర్తిలో ఘనంగా నిర్వహించారు. వార్డు నాయకుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి పార్టీ వార్డు కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్‌వెస్లీ పాల్గొని కేట్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

వాసుపల్లి కార్యాలయంలో..

దాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆశీల్‌మెట్ట వద్ద గల కార్యాలయంలో నిర్వహించిన జగనన్న జన్మదినోత్సవ వేడుకల్లో నియోజకవర్గ నాయకులు, కార్పొరేటర్లు, పార్టీ రాష్ట్ర, జిల్లా, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో లేని లోటు పేదల ఇళ్లల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అధికారంలో ఉండి ఉంటే పేదలకు నేరుగా రూ. 70 వేల కోట్ల పథకాలు అందేవని చెప్పారు. అమ్మ ఒడి లబ్ధిదారుల నుంచి ఆటో డ్రైవర్ల వరకు అంతా డీలా పడ్డారన్నారు. కుతంత్ర రాజకీయాలతో అధికారంలో కూర్చున్న కూటమి ప్రభుత్వాన్ని నమ్మి ఓటు వేసిన పేద ప్రజలను నిలువునా ముంచారన్నారు. ప్రజలు కోరుకునే విధంగా జగన్‌మోహన్ రెడ్డి మబ్బులు వీడిన సూర్యుడిలా మళ్లీ అధికారంలోకి వచ్చి వెలుగునిస్తారని వాసుపల్లి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ బొల్లవరపు జాన్‌వెస్లీ, కార్పొరేటర్లు తోట పద్మావతి, కోడిగుడ్ల పూర్ణిమ, పార్టీ నాయకులు కోడిగుడ్ల శ్రీధర్, దశమంతుల మాణిక్యాలరావు, మైకేల్ రాజు, వేణుగోపాల్, భీశెట్టి ప్రసాద్, డేవిడ్‌రాజ్, బాలు, లింగం శ్రీను, లండా రమణ, వడ్డాది దిలీప్, ముజీబ్‌ఖాన్, కోన శంకర్, సనపల రవీంద్ర భరత్, ప్రసాద్, తాడి రవితేజ, బెవర మహేష్, వాసుపల్లి భారతి, ఆకుల శ్యామ్, కోరాడ సురేష్, దైవకుమార్, పెద్ద ఎత్తున కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



జగన్ జన్మదినోత్సవంలో పాల్గొన్న పార్టీ నాయకులు

కేజీహెచ్‌లో అర్ధరాత్రి తనిఖీలు



కేజీహెచ్‌లో అర్ధరాత్రి తనిఖీల్లో భాగంగా రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: రోగులకు అందే సేవలు మెరుగుపరచడానికి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆయన శుక్రవారం అర్ధరాత్రి క్యాజువాలిటీ, అత్యవసర విభాగం, పిల్లల వార్డు, గైనిక్ వార్డు, ఐసీయూ, యాంటీ మెడికల్ కేర్ యూనిట్ (ఏఎంసీ) వార్డుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో రోగి సంరక్షణలో లోపాలు, వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు సంభవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వార్డుల్లోనే కేస్ షీట్లు..

ఇక నుంచి మూడు వార్డుల్లో రాత్రి సమయంలో కేస్ షీట్లు జారీ చేయనున్నారు. కేస్ షీట్ల కోసం రోగుల బంధువులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ కార్డియాలజీ, గైనిక్, పిల్లల వార్డుల్లోను కేస్ షీట్లు జారీ చేసి ఇవ్వడానికి ఏర్పాట్లు చేశారు. గతంలో వీటిని క్యాజువాలిటీలో ఇచ్చేవారు. ఇప్పుడు మూడు వార్డుల్లో జారీ ప్రక్రియను అమలు చేస్తున్నట్టు సూపరింటెండెంట్ వివరించారు.

కుటుంబం చెంతకు ఒడిశా వాసి



తండ్రి చెంతకు చేరిన రమేష్

సీతమ్మధార: రోజూ తాగడం, భార్యను, కొడుకును చితకబాదడం ఇదీ ఆ మానసిక రోగి దినచర్య. శ్రద్ధా సోషల్ వర్కర్ సునీల్ కుమార్ దాస్ ఇచ్చిన సమాచారం ప్రకారం గంజాం జిల్లా బరీడా గ్రామ నివాసి రమేష్ మహన్కుడ ఐదేళ్లగా తాగుడు వ్యసనం కలిగి ఉండడంతో అతని మానసిక ఆరోగ్యం క్షీణించింది. భర్త పెట్టే హింస భరించలేక భార్య కొడుకుని తీసుకుని వెళ్లిపోయింది. దీంతో ఊరు వదిలి వైజాగ్ వచ్చేసిన రమేష్‌ను ఏయూటీడీ సిబ్బంది కాపాడి, షెల్టర్ హోంలో పెట్టి వైద్యం అందించారు. అతను కోలుకుని మామూలు మనిషయ్యాడు. వైజాగ్ నుంచి నేరుగా తీసుకెళ్లి ఒడిశాలోని తండ్రి గుండిచ మహాన్కుడకు క్షేమంగా అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి వాసు తెలిపారు.

28, 29 తేదీల్లో టాలెంట్ పోటీలు



చిన్నారులచే పోస్టర్ ఆవిష్కరింపజేస్తున్న మహ్మద్ షకీల్

దాబాగార్డెన్స్: మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీల్లో మిరాకిల్ టాలెంట్ అవార్డ్స్–2024 పేరిట ప్రతిభా పోటీలు నిర్వహించనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు, కొరియోగ్రాఫర్ మహ్మద్ షకీల్ తెలిపారు. ఈ మేరకు శనివారం సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎంటర్‌టైన్‌మెంట్ క్లబ్ చిన్నారులచే పోస్టర్ ఆవిష్కరించి, పోటీల వివరాలు వెల్లడించారు. 28న ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వేదికగా సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. అలాగే 29న దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ పోటీలు ఉంటాయన్నారు. క్లాసికల్ డ్యాన్స్, వెస్ట్రన్ డ్యాన్స్, సింగింగ్, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్, డ్రాయింగ్, పెయింటింగ్, గెటప్స్, డైలాగ్స్, ట్రెడిషనల్ డ్రెసెస్, ఫ్యాన్సీ డ్రెస్ తదితర పోటీలు ఉంటాయని, అన్ని వయసుల వారు అర్హులేనని చెప్పారు. మరిన్ని వివరాలకు 9966485335 నంబరులో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ దళిత సంఘాల ప్రదర్శన



మాట్లాడుతున్న బూసి వెంకట్రావు

దాబాగార్డెన్స్ : పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం విదసం ఆధ్వర్యంలో దళిత సంఘాలు దాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టాయి. బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహం చుట్టూ అమిత్‌షా దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విదసం ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు మాట్లాడుతూ అమిత్‌షా కర్మ ఫలంతో స్వర్గానికి చేరుతారో..నరకానికి చేరుతారో గానీ..అంబేడ్కర్ లేకుంటే..రాజ్యాంగం లేకుంటే హోం మంత్రి కాగలిగేవారా? అని ప్రశ్నించారు. అమిత్‌షా వ్యాఖ్యలపై భారత రాష్ట్రపతి సుమోటోగా స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓంకార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భీమ్‌సేన వార్ ప్రతినిధి రాజేంద్రప్రసాద్, దళిత సేన ప్రతినిధి గొల్లమాల అప్పారావు, బీఎస్పీఐ ప్రతినిధి దుర్గారావు, బానాసా ప్రతినిధి నూకరాజు, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకుడు మాటూరి శ్రీనివాసరావు, యూటీఎఫ్ నాయకుడు అంబేడ్కర్, విదసం నాయకులు బూల భాస్కరరావు పాల్గొన్నారు.

స్క్రాప్ గొడౌన్‌లో అగ్ని ప్రమాదం



కాలి బూడిదైన ప్లాస్టిక్ సామగ్రి

జగదాంబ: షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ స్క్రాప్ గొడౌన్ దగ్ధం అయింది. వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 35వ వార్డు జీఎస్ఎన్ శాస్త్రి రోడులో సోనూ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో స్క్రాప్ గొడౌన్ ఉంది. ఇందులో పాత ఇనుప సామాన్లు, ప్లాస్టిక్ స్క్రాప్ వస్తువులు ఉంటాయి. శుక్రవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి ప్లాస్టిక్ స్క్రాప్ వస్తువులు కాలి మంటలు చెలరేగాయి. దీంతో సమీపంలో ఉన్న కొందరు వ్యక్తులు హుటాహుటిన అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయడంతో వాళ్లు వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పాత ప్లాస్టిక్ మాత్రమే కాలిపోవడంతో పెద్దగా ఆస్తి నష్టం జరగలేదని గొడౌన్ యాజమానులు తెలిపారు.

వినియోగదారుల హక్కులు గౌరవించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం వినియోగదారుల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. కళాశాల వాణిజ్య విభాగం నేతృత్వంలో నిర్వహించిన వారోత్సవాల్లో భాగంగా వర్చువల్ హియరింగ్ అండ్ డిజిటల్ యాక్సెస్ టు కన్జ్యూమర్స్ జస్టిస్ నినాదంతో కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడారు. వినియోగదారుల హక్కులు గౌరవించడం ప్రజాస్వామ్యానికి మూల స్తంభమని పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ కన్జ్యూమర్ రెడ్రెసల్ ఫోరం–1 అధ్యక్షురాలు డాక్టర్ జి. తనూజ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారుడు కొనుగోలు చేసిన వస్తువుల్లో లోపాలుంటే కోర్టును ఆశ్రయించవచ్చని, వినియోగదారులకు గల రక్షణ చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లా కాలేజీ ప్రిన్సిపాల్ కె. సీతామాణిక్యం, కన్జ్యూమర్ క్లబ్ కో ఆర్డినేటర్ ఎన్. నిర్మలాకుమారి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, అధ్యాపకురాలు డాక్టర్ జి. నాగశాంతి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో ధ్యాన దినోత్సవం..

కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడారు. ధ్యానం మనసుని ప్రశాంతంగా ఉంచుతుందని తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి శారద, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకురాలు డాక్టర్ ఆర్. కిరణ్మయి, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అబ్బ ముసురేసింది..

- వదలని వానతో జనం ఇక్కట్లు



నిర్మానుష్యంగా మారిన రామకృష్ణా రైతుబజార్

అల్లిపురం: గత మూడు రోజులుగా ముసురు వదల్లేదు. దీంతో నగర వాసులు అబ్బ ముసురేసింది.. అయ్యో చలివేసింది అనే సినిమా పాట గుర్తుకు తెచ్చుకుంటూ తంటాలు పడుతున్నారు. టీ దుకాణాలు, పకోడీ బండ్ల వద్ద గుమిగూడుతున్నారు. వేడి టీతో కాస్త సేదదీరుతున్నారు. రిక్షా వాలాలు వర్షంలోనే బాడుగ కడుతున్నారు. అల్లిపురం మార్కెట్‌లో వ్యాపారాలు లేక మార్కెట్ రోడ్డు నిర్మానుష్యంగా మారింది. యాచకులు, కూలీలు చలికి వణుకుతూ దొండపర్తి దరి ఫ్లైఓవర్ కింద తలదాచుకుంటున్నారు.



అల్లిపురం మార్కెట్‌లో అరకొర అమ్మకాలు

జగదాంబ: తుపాను నేపథ్యంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా మార్కెట్లు నిర్మానుష్యంగా మారిపోయాయి. దీనికి తోడు వాతావరణ శాఖ ఇచ్చిన నివేదిక, కలెక్టరేట్ నుంచి జారీ అయిన ఎల్లో అలర్ట్‌తో ప్రజలు బయటికి రాలేదు. శనివారం ఓ మోస్తరుగా వర్షపు జల్లులు పడడంతో వినియోగదారులు పూర్ణామార్కెట్‌కు వచ్చి సరుకులు కొనుగోలు చేశారు. రామకృష్ణా రైతుబజార్ మాత్రం పూర్తిగా నిర్మానుష్యంగా మారిపోయింది. దీంతో చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

ఆకట్టుకున్న 'రుద్రాక్ష మహిమ' హరికథ

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట, శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం విజయనగరం జిల్లాకు చెందిన కాళ్ల నిర్మల భాగవతారిణిచే నిర్వహించిన రుద్రాక్ష మహిమ హరికథా కాలక్షేపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామి వారి శేష వస్త్రం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నమయ్య భక్తి మంజరి ప్రతినిధి సరగడ నూకరాజు, రాంబాబు పాల్గొన్నారు.

సఫాయి కర్మచారి కమిషన్ ఏర్పాటుకు వినతి

మహారాణిపేట: రాష్ట్రంలో సఫాయి కర్మచారి కమిషన్ వేయాలని, దాని ద్వారా షెడ్యూల్ కులాల్లో ఉన్న 59 ఉప కులాలకు మేలు జరుగుతుందని సఫాయి కర్మచారి జిల్లా మోనిటరింగ్ కమిటీ మెంబర్ చొక్కాకుల రాంబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్న సఫాయి కర్మచారి జాతీయ కమిషన్ సభ్యుడు డాక్టర్ పీపీ వావాకు వినతిపత్రం సమర్పించారు. తక్షణం ఏపీలో సఫాయి కర్మచారి కమిషన్ వేయాలని, అలాగే రెల్లి కార్పొరేషన్ నియమించాలని రాంబాబు కోరారు.

ద్విచక్ర వాహనంతో సహా నగదు దొంగిలించిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటరావు

అల్లిపురం: పోలీస్ చెకింగ్ నిమిత్తం వాహనం నిలిపి రికార్డులు చూపించేందుకు వెళ్లిన వ్యక్తి వాహనంతో పాటు నగదు కూడా దొంగిలించిన వ్యక్తిని మహారాణిపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్రైం ఏడీసీపీ ఎం.మోహనరావు, ఏసీపీ ఎ.వెంకటరావు, సీఐ రాజులునాయుడు, ఎస్.ఐ సునీల్ పాల్గొని వివరాలు వెల్లడించారు. మద్దిలపాలెం రామాలయం వీధికి చెందిన బిల్డర్ గుడ్ల ఆంజనేయరెడ్డి గత నెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు చౌల్ట్రీ వద్ద గల రిజిస్ట్రాఫీస్‌కు వెళ్లారు. అక్కడ ఫ్లాట్ కొనుగోలుదారు డి. సూర్యారావు ఇచ్చిన రూ.2,30,000 మొత్తాన్ని తన సుజికీ యాక్సస్ బండి డిక్కీలో భద్రపరిచాడు. అక్కడి నుంచి మద్దిలపాలెం వెళ్తుండగా సెయింట్ ఆంథోని స్కూల్ వద్దకు రాగానే ట్రాఫిక్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న నేపథ్యంలో అతని వాహనాన్ని కూడా ఆపారు. దీంతో పక్కనే ఉన్న మెకానిక్ షాప్ వద్ద వాహనాన్ని నిలిపి వాహనంలో రికార్డులు పట్టుకుని పోలీసులు వద్దకు వెళ్లి చూపించారు. తిరిగి తన వాహనం వద్దకు రాగా అతని వాహనం కనిపించలేదు. దీంతో బాధితుడు మహారాణిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ ఎ. వెంకటరావు, సీఐ రాజులు నాయుడు సహకారంతో ఎస్.ఐ. సునీల్ తన బృందంతో కలిసి సీసీటీవీ ఫుటేజీల ద్వారా నిందితుడు పుప్పల సతీష్‌గా గుర్తించారు. అతన్ని శనివారం ఉదయం అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్ జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.2.30 లక్షల నగదు, సుజుకి యాక్సస్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.